శరవేగంగా కులగణన సర్వే

- మొదటి స్థానంలో అల్లవరం మండలం
- 133 సచివాలయాల్లో 1,48,769 కుటుంబాల సర్వే పూర్తి



కులగణన సర్వేని పరిశీలిస్తున్న జిల్లా ప్రణాళికాధికారి సుధాకరరావు

అల్లవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే తొలి దశ తుది అంకానికి చేరింది. శతాబ్ద కాలంగా కులగణన సర్వేకి నోచుకోక అట్టడుగు బలహీన వర్గాల ప్రజలకు చేరవలసిన సంక్షేమ పథకాల్లో కోత పడుతూనే ఉంది. నిరుపేద కుటుంబాలు ప్రభుత్వం నుంచి అందే ఏ సంక్షేమ పథకాన్ని కోల్పోకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న కులగణన సర్వేని చేపట్టారు. శరవేగంగా సాగుతున్న ఈ సర్వేలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తూ కులాల వారీగా జనాభాను లెక్కిస్తున్నారు. ఇప్పటివరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీల ఆధారంగా జనాభా లెక్కల అంచనాలు ఉండేవి. సచివాలయాలు స్థాయిలో జరుగుతున్న కులగణన సర్వేతో అన్ని కులాల జనాభా లెక్కలు పక్కాగా నిర్ధారణ కానున్నాయి.

తొలి విడత కులగణన సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకూ జరగనుంది. సర్వేలో ఇంటింటా కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలతో పాటుగా వారి కులం, మతం, వ్యవసాయ భూములు, వృత్తి, విద్యార్హత, ఇల్లు స్వభావం, తాగునీరు, మరుగుదొడ్డి తదితర వివరాలను వలంటీర్లు నమోదు చేస్తున్నారు. ఫిబ్రవరి 2 నుంచి రెండో దశ కులగణన సర్వే నమోదు ప్రారంభమవుతుంది. క్షేత్రస్థాయిలో నమోదు కాని కుటుంబీకులు ఫిబ్రవరి 2 నుంచి సచివాలయం వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని 133 సచివాలయాల్లో 1,48,769 కుటుంబాలకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. 96 శాతం నమోదుతో అల్లవరం మండలం మొదటి స్థానంలో నిలిచింది.



దేవగుప్తంలో కులగణన సర్వే చేస్తున్న వలంటీర్ సుధ, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీను

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కులగణన సర్వే వివరాలు

మండలం	సచివాలయం	క్లస్టర్లు	కుటుంబాలు	జనాభా	నమోదుశాతం
అల్లవరం	23	392	22827	66655	96
అమలాపురం అర్బన్	29	489	30211	87292	94.53
ముమ్మిడివరం	7	141	8707	24903	91.34
ఐ.పోలవరం	20	358	23455	67103	90.19
కాట్రేనికోన	22	407	25660	76148	89.03
అమలాపురం రూరల్	15	292	17237	48616	85.39
ఉప్పలగుప్తం	17	342	20672	59968	84.04

ఫిబ్రవరి 2 నుంచి రెండో దశ



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమష్టి కృషితో అల్లవరం మండలం మొదటి స్థానంలో నిలిచింది. కులగణన సర్వేని ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం వారానికి రెండుసార్లు సిబ్బందికి సమీక్షలు నిర్వహించాం. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి రెండో దశ కులగణన సర్వే ప్రారంభం కానుంది.
– బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంపీడీఓ, అల్లవరం

కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇందుపల్లిలోని ఏవన్ కన్వెన్షన్ హాలులో రూరల్ మండల వైఎస్సార్ సీపీ మండల కమిటీ సమావేశంలో మంత్రి విశ్వరూప్ అధ్యక్షతన సిద్ధం కార్యక్రమంపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఏలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహించనున్న సిద్ధం కార్యక్రమానికి కార్యకర్తలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలిరావాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ధర్మానికి, అధర్మానికి యుద్ధం జరగనుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు, పచ్చపార్టీలు మరోవైపు ఉన్నాయని చెప్పారు. మనమందరం ధర్మం వైపున నిలబడి వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవింద శెట్టి, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి సూదా గణపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా అదినారాయణ, సచివాలయ మండల కన్వీనర్ చొల్లంగి సుబ్బిరామ్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రెళ్ల రమేష్‌బాబు, చేనేత సంఘం నాయకుడు జాన గణేష్, కాట్రు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. కార్యకర్తల అండదండలతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ప్రజల రుణం తీర్చుకోవడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ తనకు అవకాశం కల్పించారని చెప్పారు. వచ్చే నెల 3న దెందులూరులో జరిగే సిద్ధం భారీ బహిరంగ సభకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లా నుంచి లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు తరలివస్తారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ సభ నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారని చెప్పారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సిద్ధం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే పొన్నాడ ఆవిష్కరించారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీలు కోలా గంగాభవాని, మిరియాం జ్యోతి, జెడ్పీటీసీలు కుడిపూడి శంకరరావు, ముదునూరి సతీష్‌రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, నడింపల్లి సూరిబాబు, మండల పార్టీ కన్వీనర్లు జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, కాదా గోవిందకుమార్, పిన్నమరాజు వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రాజుపాలెంలో వరి చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముమ్మిడివరం: వరి పొలాల్లో తెగుళ్లు వ్యాప్తి చెందే అవకాశమున్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అమలాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.భవానీ, డా.పీబీ ప్రదీప్‌కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు ఎ.రాజశేఖర్, వ్యవసాయాధికారులతో కలిసి వారిద్దరూ మండలంలోని రాజుపాలెం, అయినాపురం గ్రామాల్లో వరిచేలను పరిశీలించారు. ఎంటీయూ 1121 రకం వేసిన వరి పొలాల్లో జింకు లోపం, కాండం తొలిచే పురుగు, ఆకు ముడత, కలుపు సమస్య ఉన్నట్లు గుర్తించారు. జింకు లోపం నివారణకు జింకు సల్ఫేటు 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిసి నాట్లు వేసిన 4, 5 రోజుల్లో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కాట్రేనికోన: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం కాట్రేనికోన, ఉప్పూడి ఆరోగ్య కేంద్రాల వద్ద అవగాహన సదస్సులు జరిగాయి. కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యులు ఎం.లిఖిత, నీలిమల ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వైద్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకూ జరుగుతాయని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, సీహెచ్‌ఓ శ్రీహరి, ఎస్.రమ, శ్రీపతి పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం, ఎస్.యానం పీహెచ్‌సీల్లో కుష్టు వ్యాధిపై అవగాహన మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, జోగి రాజా, వైద్యులు ఎల్.నాగార్జున, సీహెచ్‌వో వి.ప్రసాద్, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, కార్యదర్శి పి.సాయిబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్ బాధ్యతల స్వీకరణ



కమిషనర్ అయ్యప్పనాయుడి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నియమితులైన ఎస్.మనోహర్ మంగళవారం ఉదయం కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కమిషనర్ మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్లూరు జిల్లా కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మనోహర్ అమలాపురం కమిషనర్‌గా బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన కమిషనర్ నాయుడు గ్రేటర్ విశాఖపట్టణం మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పట్టణ ప్రగతికి రాజీ లేని కృషి చేస్తా

జిల్లా కేంద్రంగా ఉన్న అమలాపురం పట్టణ ప్రగతికి రాజీ లేకుండా తన వంతు కృషి చేస్తానని కమిషనర్ మనోహర్ అన్నారు. మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, కౌన్సిల్ సభ్యుల సహకారంతో కష్టపడి పని చేస్తానన్నారు. అనంతరం ఆయన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను అమలాపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురం పట్టణాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా పనిచేయాలని కమిషనర్ మనోహర్‌కు మంత్రి విశ్వరూప్ సూచించారు.

వెహికల్ స్క్రాపింగ్ పాలసీ విడుదల

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం మోటార్ వెహికల్ స్క్రాపింగ్ పాలసీ–2024ను మంగళవారం విడుదల చేసింది. పాతబడిన, మూలనపడి ఉన్న వాహనాలను దశల వారీగా తొలగించడమే లక్ష్యంగా ఈ పాలసీని విడుదల చేశారు. గతేడాది బడ్జెట్‌లో ప్రకటించిన ప్రకారం పాతబడిన వాహనాలను తొలగించి రీసైక్లింగ్‌తో వెహికల్ స్క్రాప్‌గా చేయనున్నారని రవాణా అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వాహనాలేవైనా ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి 15 ఏళ్లు పూర్తయితే వాటిని రెన్యూవల్ చేయకూడదని నిర్ణయించారు. అయితే స్పెషల్‌పర్పస్ వెహికల్స్ అయిన లా అండ్ ఆర్డర్, అంతర్గత భద్రతను నిర్వహించే వాటికి ఈ నిబంధనలు వర్తించవని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ శాఖలకు చెందిన 850 వాహనాలను స్క్రాపింగ్ చేయడానికి గుర్తించినట్లు తెలిపారు. అయితే స్క్రాప్‌కు వెళ్లిన వాహనాల స్థానంలో కొత్త వాహనాల కొనుగోలు నిమిత్తం వినియోగదారులకు ట్యాక్స్ మినహాయింపును ఇవ్వనున్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో జరుగుతున్న వివిధ విభాగాల ప్రగతిని భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తమ క్షేత్రస్థాయి పరిశీలన(ఫీల్డ్ విజిట్)లో భాగంగా మంగళవారం స్వయంగా వీక్షించి అధ్యయనం చేశారు. మున్సిపాలిటీలో అమలవుతున్న లెగసీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ తదితర విభాగాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సందేహాలను మున్సిపల్ ఏఈ వెంకటేష్, కల్వకొలనువీధి వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి బండి వీరన్న నివృత్తి చేశారు. విద్యార్థులకు లెగసీ ట్రీట్‌మెంట్ ప్లాంట్, తాగునీటి సరఫరా వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- గాంధీజీకి ఘన నివాళులు



మమ్మిడివరంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్



ఇందుపల్లిలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్



కొమరగిరిపట్నంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి



యానాంలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

అమలాపురం రూరల్: ప్రతిఒక్కరూ జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగళవారం ఇందుపల్లి ఏవన్ కన్వెన్షన్ హాల్‌లో 76వ మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే చేరుస్తూ గాంధీజీకి ఆదర్శాన్ని నిలబెట్టారన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో విజేతగా నిలిచిన ఆర్.మాధురిని మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణరావు, పురపాలక సంఘ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని, మంగళంపల్లి అంజిబాబు, వంటెద్దు వెంకన్నాయుడు, వంకాయ కాశీ, నూలు రమేష్, కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, గొవ్వాల రాజేష్, కొల్లాటి దుర్గాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొమరగిరిపట్నంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన గాంధీజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంట్రుకోనలో సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఈఓపీఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శి రాజమోహన్, అధికారులు పాల్గొన్నారు.

యానాం: సత్యాగ్రహమే ఆయుధంగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన మహాత్మా గాంధీ బాటలో నేటి తరం పయనించాల్సిన ఆవశ్యకత ఉందని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం గాంధీజీ 76వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఫెర్రీ రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక బొటానికల్ గార్డెన్, గాంధీ పార్క్, చిల్డ్రన్స్ పార్క్ వద్ద సైతం గాంధీజీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ రవిశంకర్, విద్యుత్ ఏఈ లంక కృష్ణారావు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.లోవరాజుతో పాటు పలువురు నాయకులు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. లంక తల్లమ్మ గుడి వద్ద గల నిలువెత్తు గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.ఉదయ భాస్కర వర్మ, వడ్డి నాగేశ్వరరావు, గుద్దటి బాబ్జి, శ్రీనివాసరాజు నివాళులర్పించారు.

క్లుప్తంగా

రేపు బాణాపురంలో ఆసరా కార్యక్రమం

ఐ.పోలవరం: ఫిబ్రవరి 1న బాణాపురంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా టీటీడీ బోర్డు సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలోని సాకుర్రు గున్నేపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బొలిశెట్టి వీరబాబు కుటుంబానికి రెడ్‌క్రాస్ సంస్థ సాయం అందించింది. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, రెడ్‌క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ) సూచనలతో రెడ్‌క్రాస్ వైస్ ట్రెజరర్ జల్లి సుజాత, సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణల చేతుల మీదుగా టార్పాలిన్, వంట సామగ్రి, హైజనిక్ కిట్, నిత్యావసర సరకులు, కూరగాయలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బాలరాజు, ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్నప్రసాద్, సుబ్రహ్మణ్యం, సాయిబాబు, ప్రసాద్, శ్రీరామ్‌మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కోవిడ్‌తో మరణించిన వైద్యులకు ఐఎంఏ నివాళి



డాక్టర్ విశ్వేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఐఎంఏ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఐఎంఏ శాఖకు చెందిన జిల్లా వైద్యులు స్థానిక యునైటెడ్ ల్యాబ్‌లో మంగళవారం సాయంత్రం సమావేశమై కోవిడ్‌లో మరణించిన వైద్యులకు ఘన నివాళులర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా ఐఎంఏ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, డాక్టర్ కడలి ప్రసాద్‌లు మాట్లాడుతూ అమలాపురానికి చెందిన డాక్టర్ విశ్వేశ్వరరావు కరోనా సమయంలో మృతి చెంది మన వైద్యుల కుటుంబం నుంచి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐఎంఏ ప్రతినిధులు బి.రాఘవేంద్రరావు, అనిల్, పీఎస్ శర్మ, రమణకుమార్, శివప్రసాద్, పి.సురేష్‌బాబు, దీపక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విజేతలకు సత్కారం



విజేతలను సత్కరిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఒ.వైష్ణవి గోల్డ్ మెడల్‌తో పాటు బ్రాంజ్ మెడల్, జి.సౌమ్య సిల్వర్ మెడల్, భార్గవి శ్రీకళ బ్రాంజ్ మెడల్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్ మంగళవారం సత్కరించి అభినందించారు. వారంతా మరిన్ని విజయాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

కలెక్టర్ వల్లవన్ బదిలీ

యానాం: పుదుచ్చేరి కలెక్టర్ ఇ.వల్లవన్‌ను గోవాకు బదిలీ చేస్తూ కేంద్ర హోంశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రంగసామితో సన్నిహితంగా ఉంటూ పుదుచ్చేరిలో ఎక్కువ కాలం విధులు నిర్వహించిన అధికారిగా వల్లవన్‌ను పేరొందారు. ఇటీవల కొన్ని నెలల పాటు ఢిల్లీలో శిక్షణ కోసం వెళ్లిన వల్లవన్ శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి కలెక్టర్‌గా జాయిన్ అయ్యారు. తాజాగా ఆయనను గోవాకు బదిలీ చేశారు.

సర్పంచ్‌ల నిరసన దీక్ష

అమలాపురం టౌన్: తమ డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ సర్పంచుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కొన్ని గ్రామాల సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, రంబాల రాంబాబు, అడబాల తాతకాపు తదితరులు దీక్షలో పాల్గొన్నారు. వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



ఎంపీడీఓ కృష్ణమోహన్‌ను సత్కరించిన ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి

అల్లవరం: అంకితభావంతో విధులు నిర్వహించిన అధికారులకు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం లభిస్తుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రెండు అవార్డులు అందుకున్న ఎంపీడీఓ కృష్ణమోహన్‌ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ అల్లవరం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణమోహన్ అనతికాలంలోనే పాలనలో తనదైన ముద్ర వేశారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఎంపీడీఓ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, పరిపాలనాధికారి లక్ష్మణరావు, జేఈ సంపన్, ఏపీఓ శ్రీనుబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం



విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం–ఆంధ్రా క్రీడల్లో యువ క్రీడాకారుల ప్రతిభ అభినందనీయమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీరక సామర్థ్యం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, ఎంపీడీఓ జె.రాంబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



పవన్‌కుమార్ కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని నల్లమిల్లి గ్రామానికి చెందిన రవణాతి పవన్‌కుమార్ కుమారుడి ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును వారికి మంత్రి పినిపే విశ్వరూప్ తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోకరకొండ వాసు, చెల్లుబోయిన నాని, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా అదినారాయణ, రమణాతి పల్లయ్యశెట్టి, చెల్లుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సవరణ బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం సవరించిన ఆర్థిక బడ్జెట్ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. రూ.11,600 కోట్లతో కూడిన బడ్జెట్‌తో పాటు అదనంగా రూ.270 కోట్ల మంజూరుకు అంగీకారం తెలిపింది. దీంతో పుదుచ్చేరి ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోవడానికి వీలు కలిగినట్టైంది. అదనపు నిధుల కేటాయింపుతో వివిధ ప్రాజెక్టుల పనులను వేగంగా చేపట్టానికి ఆస్కారమేర్పడనుంది.

క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను భట్నవెల్లిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండర్లను సంఘం నేతలకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు శ్రీదేవి, పట్టణ అధ్యక్షుడు క్లోవపల్లి గోవిందు, యూత్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పఢావో



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ తదితరులు

తాళ్లరేవు: జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తాళ్లరేవు మాధవరాయునిపేటలో బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ, ప్రజాప్రతినిధులు హాజరై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆడపిల్లలను ఏవిధంగా కాపాడుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నందికోళ్ల శ్రీమన్నారాయణ, శ్రీదేవి, హెచ్ఎం రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.